నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, ఆదివారం 8 డిసెంబర్ 2024 | SIDDIPET

కాంగ్రెస్ పాలనలో కుంటుపడిన అభివృద్ధి



రామకృష్ణకు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

- సిద్దిపేటపై ప్రభుత్వం కక్షకట్టడం సరికాదు..
- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తా..
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన పైస రామకృష్ణ

సిద్దిపేట, డిసెంబర్ 7: సిద్దిపేటలో పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పరుగులు పెట్టిన అభివృద్ధి కాంగ్రెస్ వచ్చాక కుంటుపడిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు పైస రామకృష్ణ తన అనుచరులతో బీఆర్ఎస్‌లో చేరారు. హరీశ్‌రావు వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సిద్దిపేట ప్రజలపై కక్ష కట్టిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో మంజూరైన అనేక పనులు రద్దు చేసిందన్నారు. అనేక పనులు అసంపూర్తిగా ఆపేసిందని తెలిపారు. రంగనాయకసాగర్ టూరిజం ప్రాజెక్టు, శిల్పారామం, దవాఖాన, రోడ్లు, ఇతర ఎన్నో పనులు అర్థాంతరంగా ఆపారన్నారు. ఇదేనా కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన అని విమర్శించారు. సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రజా ప్రయోజనాలు పట్టవా.. ఏడాదిలో సిద్దిపేటకు ఒక్క మంచి పని చేశారో కాంగ్రెస్ నాయకులు చెప్పాలని హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట అభివృద్ధి కోసం పోరాటం చేస్తానని, అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై ప్రశ్నిస్తానని పేర్కొన్నారు. రద్దు చేసిన పనులు ప్రారంభమయ్యే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలి పెట్టనన్నారు. ఎలా ఉన్న సిద్దిపేట ఎలా అయ్యిందని, అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన సిద్దిపేట అభివృద్ధి అటకెక్కిందని పైస రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం, హరీశ్‌రావు విలువ తెలిసి వచ్చిందన్నారు. కష్టమైనా, నష్టమైనా బీఆర్ఎస్ పార్టీ, హరీశ్‌రావుతోనే ఉంటానని.. సిద్దిపేట అభివృద్ధి జరగాలి, బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని ఆయన ఆకాంక్షించారు.

అర్హత ఉన్నా రుణమాఫీ కాలేదు..

ఐసీఐసీఐ బ్యాంకు మెదక్ బ్రాంచ్‌లో రూ.1.90లక్షల పంట రుణం తీసుకున్న. నాలుగో విడతలో కూడా నాకు రుణమాఫీ కాలేదు. రుణమాఫీ ఎందుకు కాలేదని వ్యవసాయాధికారులను అడిగితే అకౌంట్ నెంబర్ తప్పుగా ఉందని చెబుతున్నారు. బ్యాంకు అధికారులను అడిగితే బ్యాంక్ ఖాతా పుస్తకంలో పేరు సరిగా ఉందని చెబుతున్నారు. ఇద్దరి మధ్య ఎవరిది తప్పు ఉందని అడిగితే ఎవరు సమాధానం చెప్పడం లేదు. నేను ఏ రకంగా అర్హుడిని కాదో చెప్పాలి. నా పేరు మీద ఉన్న రుణం వెంటనే మాఫీ చేయాలి. వ్యవసాయాధికారులు నాకు న్యాయం చేయాలి.

– మహేందర్, రైతు, సోమక్కపేట, చిలిపిచెడ్ మండలం(మెదక్ జిల్లా)

– చిలిపిచెడ్, డిసెంబర్ 7:

కాంగ్రెస్ సర్కారు కక్షకట్టింది

కాంగ్రెస్ ఏడాది పాలనలో సిద్దిపేటకు తీరని అన్యాయం జరిగింది..

- సిద్దిపేట నియోజకవర్గంలో రూ. 875.92 కోట్ల పనులు ఆపేండ్రు
- వెటర్నరీ కళాశాలను కొడంగల్ తరలించుకు పోయారు..
- శిల్పారామం, రంగనాయక సాగర్ టూరిజం పనులు ఆగిపోయాయి..
- కేసీఆర్ హయాంలో మంజూరైన పనులు రద్దుచేసిండ్రు
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

నమస్తే ఇంటర్వ్యూ INTERVIEW

సిద్దిపేట, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో సిద్దిపేట నియోజకవర్గానికి మొండిచేయి చూపింది. రూపాయి నిధులు ఇవ్వలేదు. కేసీఆర్ ప్రభుత్వంలో మంజూరైన అభివృద్ధి పనులు రద్దు చేయడంతో పాటు నిర్మాణంలో ఉన్న పనులను మధ్యలో ఆపేసింది. సిద్దిపేటపై కక్షకట్టి నిధుల మంజూరులో వివక్ష చూపుతున్నది'.. అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మండిపడ్డారు. శనివారం 'నమస్తే తెలంగాణ'తో ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: కాంగ్రెస్ ఏడాది పాలన ఎలా ఉంది..?

హరీశ్‌రావు: కాంగ్రెస్ ప్రభుత్వం రివర్స్ గేర్‌లో నడుస్తోంది. ప్రజలకు కొత్త పథకాలు అందక పోగా ఉన్న పథకాలు ఒక్కొక్కటిగా పోతున్నాయి. దవాఖానకు పోతే కేసీఆర్ కిట్ ఇవ్వడం లేదు. న్యూట్రీషన్ కిట్ బంద్ చేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఆలస్యమవుతున్నాయి. అవ్వాతాతలకు పింఛన్ సరిగ్గా రావడం లేదు. కేసీఆర్ హయాంలో కరోనా కష్టకాలంలోనూ రైతులకు సకాలంలో రైతుబంధు ఇచ్చినం. ఇప్పుడు ఈ కాంగ్రెస్ సర్కారు రైతు భరోసాకు రాంరాం పెట్టింది. పూర్తిస్థాయిలో రైతులకు రెండు లక్షల రుణ మాఫీ చేయలేదు. వడ్లకు బోనస్ బోగస్ అయ్యింది. అనేక పథకాలు ఆగిపోయాయి. అభివృద్ధి కుంటు పడింది. ఏడాదిలో ఒక్క అభివృద్ధి పని ప్రభుత్వం చేసింది లేదు.

ప్రశ్న: కాంగ్రెస్ ఏడాది పాలనలో మీ నియోజకవర్గం సిద్దిపేటకు ఏమి అన్యాయం జరిగింది..?

హరీశ్‌రావు: సిద్దిపేట నియోజకవర్గంలో రూ. 875.92 కోట్ల పనులు కాంగ్రెస్ ప్రభుత్వం ఆపేసింది. సిద్దిపేట నియోజకవర్గంపై రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా కక్ష కట్టింది. శిల్పారామం రూ. 23 కోట్లు, నెక్లెస్ రోడ్డు రూ. 15 కోట్లు, వెటర్నరీ కళాశాల రూ. 300 కోట్లు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ రూ.25కోట్లు, రంగనాయక సాగర్ టూరిజం పనులు రూ.100 కోట్లు, వెయ్యి పడకల దవాఖానలో వివిధ సేవలకు రూ. 27 కోట్లు, మహతి ఆడిటోరియం రూ 50 కోట్లు పనులు ఆగిపోయాయి. చింతమడక రెసిడెన్షియల్ స్కూల్ డార్మెట్, క్లాస్‌రూమ్స్ రూ.18 కోట్లు, బీఎస్సీ అగ్రికల్చర్ తోర్నాల రూ. 31 కోట్లు, మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కాలేజీ రూ. 17 కోట్లు, నర్సింగ్ కళాశాల రూ. 20 కోట్లు పనులు మేం పూర్తి చేశాం. మరో రూ. 20 కోట్ల పనులు మధ్యలో ఆగిపోయాయి. టూటౌన్ పోలీస్‌స్టేషన్ రూ. 4 కోట్లు మంజూరు కాగా.. రూ. 2 కోట్ల పనులు మధ్యలోనే ఆగిపోయాయి. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ రూ. 4 కోట్ల 44 లక్షలు ఇంకా పనులు ప్రారంభం కాలేదు. రోడ్లు భవనాల శాఖ నుంచి మంజూరైన రూ. 81.15 కోట్ల పనులు రద్దు చేశారు. రోడ్లు భవనాల శాఖ నుంచి నిధులు మంజూరై పనులు ప్రారంభం కానివి రూ. 47.50 కోట్లు, ఆర్‌ఆండ్‌బీ పనులు మధ్యలో ఆగిపోయినవి రూ. 52.20 కోట్లు, పంచాయతీ రాజ్ రోడ్డు రూ. 62.63 కోట్లు పూర్తిగా ఆగిపోయాయి. నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటున్నది.

ప్రశ్న: నిజంగానే కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని అడ్డుకుంటున్నదా..?

హరీశ్‌రావు: ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్ ప్రభుత్వం నా నియోజకవర్గంలో కోపం పెట్టుకుని అభివృద్ధిని అడ్డుకుంటున్నది. సిద్దిపేట కలెక్టరేట్ సమీపంలో (పీవీ నరసింహరావు తెలంగాణ పశువైద్య విద్యాలయం) వెటర్నరీ కళాశాలను కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసింది. 30ఎకరాల విస్తీర్ణంలో బాలురు, బాలికల వసతితో పాటు కళాశాల నిర్మాణం చేపట్టేలా రూపకల్పన చేశాం. ఇందుకు రూ. 180 కోట్లు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.100 కోట్ల నిధులు కేటాయించి పనులు ప్రారంభించాం. కానీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్దిపేటపై కక్షకట్టి ఈ కళాశాల పనులను రద్దుచేసి కొడంగల్‌కు తరలించుకు పోయింది. అక్కడ ఇంకో కళాశాల పెట్టుకోవాలి. కానీ, సిద్దిపేట కళాశాలను ఎలా తరలిస్తారు. దీనిపై ప్రభుత్వాన్ని నిలదీశా. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట జిల్లాలో నిర్మించిన రిజర్వాయర్ల ద్వారా పంట సాగు విస్తీర్ణం పెరిగింది. పశుసంపద బాగా వృద్ధి చెందింది. జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలకు అందుబాటులో ఉండేలా సిద్దిపేటలో ప్రభుత్వ వెటర్నరీ కళాశాలను కేసీఆర్ మంజూరు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేసి ఈ కళాశాలను కొడంగల్‌కు తరలించుకుపోయింది.

గుట్టుగా ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన ఆలయ ట్రస్ట్ బోర్డు

చేర్యాల, డిసెంబర్ 7: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం గుట్టుగా శనివారం జరిగింది. ఈనెల 3న నాటకీయ పరిణామాల మధ్య రాత్రిపొద్దు పోయిన తర్వాత 8మంది సభ్యులు, కోఆప్షన్ సభ్యుడితో కూడిన ట్రస్ట్ బోర్డును దేవాదాయశాఖ నియమించింది. మరో ఆరుగురు సభ్యుల కోసం దరఖాస్తు చేసుకోవాలని జీవో 463ను విడుదల చేసింది. ఏటా స్వామివారి కల్యాణోత్సవం సమీపిస్తున్న వేళ ఆలయ ధర్మకర్తల మండలి లేదా ఉత్సవ కమిటీని ప్రభుత్వం నియమించేంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం గతేడాది ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం 8 మంది సభ్యులు, ఆలయ ప్రధానార్చకుడు కోఆప్షన్ సభ్యుడితో కూడిన ట్రస్ట్‌బోర్డును ఆలయానికి నియమించింది. ఉమ్మడి మెదక్ జిల్లా ఏసీ ఎ.చంద్రశేఖర్ సమక్షంలో ధర్మకర్తల మండలి సభ్యులు చిగిరి కొమురయ్య, కాయిత మోహన్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, అల్లం శ్రీనివాస్, వల్లాద్రి అంజిరెడి, మామిడాల లక్ష్మి, నేరెల్లపల్లి మచ్చేందర్‌రెడ్డి, కొప్పురపు జయప్రకాశ్‌రెడ్డితో శనివారం ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బాలాజీ, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు తదితరులు పాల్గొన్నారు.

కురుమలు తరలిరావాలి

కురుమ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బూరుగడ్డ నగేశ్ కురుమ

సమావేశంలో మాట్లాడుతున్న బూరుగడ్డ నగేశ్ కురుమ

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 7: ఈనెల 14న కోకాపేటలో జరిగే దొడ్డి కొమురయ్య ఆత్మగౌరవ భవనం ప్రారంభోత్సవానికి సంగారెడ్డి జిల్లా నుంచి కరుమలు భారీగా తరలిరావాలని షెఫర్డ్ ఇంటర్నేషనల్ రాష్ట్ర అధ్యక్షుడు, కురుమ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బూరుగడ్డ నగేశ్ కురుమ పిలుపునిచ్చారు. శనివారం సంగారెడ్డిలోని బైపాస్ రోడ్డులోని కురుమ సంఘం జిల్లా కార్యాలయం వద్ద గల ఓ ఫంక్షన్ హాలులో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో బూరుగడ్డ నగేశ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం కురుమల కోసం కోకాపేటలో కేటాయించిన ఐదెకరాల స్థలంలో రూ.5 కోట్లతో దొడ్డి కొమురయ్య భవన నిర్మాణం పూర్తయిందన్నారు. ఈనెల 14న భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి దేశంలోని 29 రాష్ట్రాల కురుమ నాయకులు హాజరవుతారని తెలిపారు. సంగారెడ్డి జిల్లా నుంచి 10 వేలకు తగ్గకుండా కార్యక్రమానికి వెళ్లనున్నట్టు చెప్పారు. రింగ్ రోడ్డు వరకు చేరుకొని అక్కడి నుంచి ర్యాలీగా వెళ్తామని, మధ్యాహ్నం భోజన వసతి కల్పిస్తామని తెలిపారు. పలు రాష్ట్రాల సీఎంలు, గవర్నర్లు, మంత్రులు, ఎంపీలు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపల్లి పాండు, మాజీ ఎంపీపీ ఆంజనేయులు, నాయకులు పోచారం రాములు, ఉత్తర్పల్లి మాణయ్య, గోకుల్ కృష్ణ, శ్రీనివాస్ ఖన్నా, రవీందర్, సత్యనారాయణ, పాండు, కాల్వగడ్డ మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకలో అకాల వర్షం

- మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం

దుబ్బాక మార్కెట్ యార్డులో వర్షానికి తడిసిన ధాన్యం

దుబ్బాక, డిసెంబర్ 7: సిద్దిపేట జిల్లా దుబ్బాకలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి మార్కెట్ యార్డులో ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం అలసత్వం కారణంగా అకాల వర్షంతో ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను మార్కెట్‌యార్డుకు విక్రయానికి తెచ్చిన అన్నదాతలకు కన్నీళ్లే దిక్కయ్యాయి. దుబ్బాక మార్కెట్‌యార్డులో శనివారం కురిసిన వర్షానికి చాలామంది రైతుల ధాన్యం తడిసిపోయింది. రైతులు ధాన్యంపై టార్పాలిన్ కవర్లు కప్పినా ఫలితం లేకుండా పోయింది. వర్షం నీరు ధాన్యం కుప్పల కిందకు చేరడంతో తడిసిపోయాయి. మరి కొందరు రైతులు టార్పాలిన్ కవర్లు లేకపోవడంతో చేసేదేమిలేక అలాగే వదిలేశారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

చిన్నశంకరంపేటలో...

చిన్నశంకరంపేట, డిసెంబర్ 7: చిన్నశంకరంపేటతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం భారీవర్షం కురిసింది.

ఆటోడ్రైవర్ల పొట్టకొడుతున్న ప్రభుత్వం

వెల్దుర్తి అంబేద్కర్ చౌరస్తా వద్ద బస్సును నిలిపి ధర్నా చేస్తున్న ఆటోడ్రైవర్లు

బెజ్జంకిలో నిరసన తెలుపుతున్న ఆటో యూనియన్ సభ్యులు

వెల్దుర్తి, డిసెంబర్ 7: బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించిన ప్రభుత్వం ఆటోడ్రైవర్ల పొట్టకొడుతున్నదని ఆటోడ్రైవర్ల సంఘం మండల అధ్యక్షుడు భాషాగౌడ్, ఉపాధ్యక్షుడు షాబొద్దీన్ మండిపడ్డారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిండాన్ని నిరసిస్తూ శనివారం వెల్దుర్తితో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆటోడ్రైవర్లు ఆటోలు నిలిపేసి, ధర్నా చేశారు. ధర్నాలో ఆటో డ్రైవర్లు ప్రవీణ్, బాలేశ్, మహిపాల్, గోపాల్, రమేశ్, అనిల్, మహేశ్, నరేశ్, శ్రీను, శేఖర్ పాల్గొన్నారు.

ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన

బెజ్జంకి, డిసెంబర్ 7: ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బెజ్జంకి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బంధు పాటించి, అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటుతో ఆటోడ్రైవర్లు రోడ్డున పడ్డారని, వారికి ప్రభుత్వం నెలకు రూ.12 వేలు ఇస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా ఆటోడ్రైవర్ల దీనస్థితిని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీరుతో ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం స్పందించి ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.

విజయోత్సవానికి ఎమ్మెల్యే గూడెం డుమ్మా

పటాన్‌చెరు, డిసెంబర్ 7: పటాన్‌చెరు నియోజకవర్గ స్థాయి ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాన్ని శనివారం బచ్చుగూడెంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ హాజరయ్యారు. కానీ, స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హాజరుకాలేదు. దీంతో మరోసారి వివిధాలు బయటపడ్డాయి. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరినా పార్టీ కార్యక్రమాలకు ఆయన హాజరు కావడం లేదు. జిల్లాకు పీసీసీ అధ్యక్షుడు వచ్చినా కలువలేదు. తాజాగా శనివారం ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమానికి ఆయన డుమ్మా కొట్టారు. గూడెం మహిపాల్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి గెలిచి కొన్ని నెలల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ, ఆయనకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తగిన గుర్తింపు ఇవ్వడం లేదని, నియోజకవర్గంలో పార్టీ బాధ్యతలు ఆయనకు అప్పగించక పోవడంతో ఆయన అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆయన అప్పటి నుంచి పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి చేరికను కాట శ్రీనివాస్‌గౌడ్ తీవ్రంగా వ్యతిరేకించారు. కానీ, ఆయన చేరికను కాటా అడ్డుకోలేక పోయారు. గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత కాట, గూడెం మహిపాల్‌రెడ్డికి మధ్య పడడం లేదని తెలిసింది.

విద్యుదాఘాతంతో రైతు మృతి

రాంరెడ్డి(ఫైల్)

ఘటనా స్థలంలో రాంరెడ్డి మృతదేహం

జహీరాబాద్, డిసెంబర్ 7: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం చినిగేపల్లిలో శనివారం విద్యుదాఘాతంతో రైతు మృతిచెందాడు. హద్నూర్ పోలీసులు, గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం... చినిగేపల్లి గ్రామానికి చెందిన రైతు చెవ్వుల రాంరెడ్డి(49) పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా లేకపోవడంతో పొలం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. త్రీఫేజ్ విద్యుత్‌ను సరఫరా చేసేందుకు తొలిగిపోయిన జంపర్ వైరు బిగించాడు. ఆ తర్వాత ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా ప్రారంభించే సమయంలో జంపర్ వైరు హ్యాండిల్‌కు తగలడంతో ప్రమాదవశాత్తు షాక్ గురై కిందపడి మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హద్నూర్ పోలీసులు తెలిపారు.

కాలంచెల్లిన ఆహార పదార్థాలు వాడొద్దు

- పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి
- వర్గల్ నవోదయ విద్యాలయాన్ని సందర్శించిన సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

వర్గల్: నవోదయ విద్యాలయం వంట గదిలో వస్తువులను పరిశీలిస్తున్న కలెక్టర్

వర్గల్, డిసెంబర్ 7: వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయాన్ని కలెక్టర్ మనుచౌదరి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా నవోదయ ప్రిన్సిపాల్‌తో కలిసి వసతి గృహాలను, డైనింగ్ హాల్, స్టోర్, కిచెన్ షెడ్‌లను పరిశీలించారు. కాలం చెల్లిన పదార్థాలను వాడరాదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. విద్యాలయం పాత భవనం కావడంతో చిన్నచిన్న రిపేర్లు ఉన్నాయని బాగు చేయించాలని, విద్యార్థుల వైద్యసేవల నిమిత్తం ఒక వెహికల్‌ను ఏర్పాటు చేయాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అనంతరం క్లాస్‌రూంలకెళ్లి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి: కలెక్టర్

ములుగు, డిసెంబర్ 7: విద్యార్థులు పట్టుదలతో చదివి బంగారు భవితకు బాటలు వేసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శనివారం ములుగులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రతి అంశంపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని చేరుకోవాలంటే సమయాన్ని వృథా చేయకుండా ఏకాగ్రతతో చదవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో సమస్యలను ప్రిన్సిపాల్ వివరించగా వాటి పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుష్పలత, ఉపాధ్యాయులు ఉన్నారు.

వర్గల్‌లో విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

అట్టహాసంగా కేసీఆర్ క్రికెట్ టోర్నీ

టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్లు మెట్టుకుమార్, ఆదర్శ్‌రెడ్డి

క్రికెట్ ఆడుతున్న కార్పొరేటర్ మెట్టు కుమార్

అమీన్‌పూర్, డిసెంబర్ 7: యువత సామాజిక సేవల్లో ముందుండాలని పటాన్‌చెరు, భారతీగర్ కార్పొరేటర్లు మెట్టు కుమార్, సింధూఆదర్శ్‌రెడ్డి అన్నారు. శనివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఐలాపూర్ మైదానంలో కేసీఆర్ క్రికెట్ టోర్నీని బీఆర్ఎస్ యువ నాయకుడు మాణిక్యం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవ, పట్టుదలను పెంపొందించడంలో తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దేశానికి స్ఫూర్తిదాత అని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. క్రీడలు శారీరిక దారుఢ్యంతోపాటు మానసిక ప్రశాంతను పెంపొందిస్తాయన్నారు. కేసీఆర్ ఆదర్శ భావాలను ప్రజల్లోకి తీసుకుపోయి చైతన్యవంతులను చేయాలన్నారు. అనంతరం క్రీడాకారులతో కలిసి కొంతసేపు క్రికెట్ ఆడి జట్టు సభ్యుల్లో ఉత్సాహం నింపారు. కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న మాణిక్యంను ప్రత్యేకంగా అభినందించారు. టోర్నమెంట్ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.